
# గాంధీ దవాఖానలో అగ్నిప్రమాదాలపై మాక్ డ్రిల్



గాంధీ ఆస్పత్రిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది



**హైదరాబాద్, మే 12 ప్రభాతవార్త :** గాంధీ దవాఖానలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. వందలాది మంది రోగులు, సాధారణ ప్రజలు, వైద్యులు, సిబ్బంది ఉండే గాంధీ దవాఖానలో అనుకోకుండా ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే ప్రజలు ఒక్కసారిగా ఆందోళనకు గురవుతారు. అలాంటి సమయంలో ఎలా అప్రమత్తంగా ఉండాలి, రోగులను సురక్షితంగా ఎలా బయటకు తీసుకురావాలి, మంటలను, పొగను ఎలా అదుపులోకి తీసుకురావాలి అనే అంశాలను వివరించారు. రోబో యంత్రాలతో హైస్పీడ్ ప్రెజర్‌తో నీటిని ఎలా స్ప్రే చేస్తామో చూపించారు. సహాయ జిల్లా ఫైర్ అధికారి భానుప్రతాప్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు పి.రమేశ్, షౌకత్ అలీ, బిక్షపతి, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.



హైదరాబాద్ వార్త



# జైళ్ల శాఖ అధికారుల వినూత్న ప్రయోగం



## -సికాలో జైల్ మ్యూజియం..ఫీల్ ద జైల్ ప్రారంభం
## -రూ.500 చెల్లిస్తే ఒక రోజు జైలు జీవితం..

**సైదాబాద్, మే 12 ప్రభాతవార్త:** తెలంగాణ జైళ్ల శాఖ అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. చంచల్‌గూడ జైలు పక్కన ఉన్న స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్(సికా)లో జైల్ మ్యూజియం..ఫీల్ ద జైల్ పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ఏర్పాటు చేశారు. సాధారణ ప్రజలు జైలు వ్యవస్థ గురించి తెలుసుకోవడానికి ఈ మ్యూజియం తోడ్పడుతుంది. నేర రహిత సమాజ నిర్మాణంలో భాగంగానే ప్రజల్లో పరివర్తన తీసుకురావడం కోసమే ఈ మ్యూజియంను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జైళ్ల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. క్షణికావేశంలో నేరాలు చేస్తే జీవితం ఎలా తలకిందులవుతుందో, జైలు జీవితం గడపడం ఎంత కష్టమో ప్రజలకు తెలిసేలా చూపించడమే తమ ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల మంగళవారం ఈ జైల్ మ్యూజియంను ప్రారంభించారు. అండమాన్ అండ్ నికోబార్, అలీపోర్(కోల్‌కత్తా), బెంగళూరు, గోవాలలో మాత్రమే ప్రస్తుతం జైలు మ్యూజియంలు ఉన్నాయి. చంచల్‌గూడలో ఏర్పాటు చేసిన జైలు మ్యూజియం దేశంలోనే అయిదవది. 2016లో సంగారెడ్డిలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన జైలు మ్యూజియం కరోనా తర్వాత మూత పడి కూలిపోవడంతో అక్కడ ఉన్న కళాఖండాలకు తోడుగా మరికొన్నింటితో కలిపి సికాలో నూతనంగా జైలు మ్యూజియంను ఏర్పాటు చేశారు. ప్రాచీన కాలం నుండి నేటి వరకు జైళ్లలో వచ్చిన మార్పుల గురించి ఇక్కడ మనం తెలుసుకోవచ్చు. థీమ్ ఆధారిత చిత్రాలు, ప్రత్యేక ఏర్పాట్లు, ప్రదర్శనల ద్వారా నేరాలు, శిక్షల విధానాలను, జైళ్ల వ్యవస్థలో వచ్చిన మార్పులను సందర్శకులకు సులువుగా అర్థమయ్యేలా ఏర్పాటు చేశారు. నిజాం కాలం నాటి జైళ్లు, అప్పట్లో ఖైదీలకు వేసే సంకెళ్లు, ఆయుధాలు, ఉరితీసే తాడు, నాటి రికార్డులు, నూలు వడికే పనిముట్లు, నిజాం నవాబు లండన్ నుండి తెప్పించిన కంచుగంట, అప్పటి రేడియోలు, వాల్ క్లాక్‌లు, వంటి అనేక చారిత్రక విశేషాలను మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచారు. సాధారణ బ్యారక్‌లు, హై సెక్యూరిటీ బ్యారక్‌లు ఎలా ఉంటాయో స్వయంగా చూడవచ్చు. తెలంగాణ చరిత్ర, భారత స్వాతంత్రోద్యమ చరిత్రకు సంబంధించిన పెయింటింగ్‌లను ప్రదర్శనలో ఉంచారు. కోర్టు విచారణలు, జైళ్లలో ఖైదీలతో వారి కుటుంబ సభ్యుల ములాఖత్‌లు ఎలా ఉంటాయో తెలిపేలా ఆడియో విజువల్ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. నిజాం నవాబుల కాలంలో భక్త రామదాసును బంధించిన గోల్కొండ జైలు, బ్రిటిష్ కాలం నాటి పాత జైళ్ల చిత్రాలను ఇక్కడి గ్యాలరీలో ఏర్పాటు చేశారు. అప్పట్లో ఉపయోగించిన వింటేజ్ డీజిల్ జనరేటర్ సెట్, మెకానికల్ ప్లాట్ ఫాం వేయింగ్ మెషీన్, మ్యాన్యువల్ గ్రెయిన్ గ్రైండింగ్ మెషీన్, మ్యాన్యువల్ లెదర్ పంచింగ్ మెషీన్ వంటి వాటిని ప్రదర్శనకు ఉంచారు.





జైల్ మ్యూజియం



ఫీల్ ది జైల్ బ్లాక్

### ఖైదీ డ్రెస్‌లో..బ్యారక్‌లో..ఫీల్ ద జైల్..

సాధారణ ప్రజలు ఖైదీల మాదిరిగా 24 గంటల పాటు జైలు జీవితాన్ని గడిపే అవకాశాన్ని ఈ మ్యూజియంలో కల్పిస్తున్నారు. అయితే దీని కోసం రూ.500లు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఇలా జైలు జీవితాన్ని గడపాలనుకునే వారి ఫోన్, ఇతర సాంకేతిక పరికరాలను వెంట ఉంచుకునేందుకు అనుమతి ఉండదు. ఖైదీలు ధరించే దుస్తులే ధరించి, ఖైదీల మాదిరిగానే ఒక రోజు గడపాల్సి ఉంటుంది. దిన చర్య జైలు మ్యాన్యువల్ ప్రకారం ఖైదీల మాదిరిగానే ఉంటుంది. ఖైదీలకు ఇచ్చే అహారాన్నే ఇక్కడ ఉండే వారికి ఇస్తారు. బయటి అహారాన్ని అనుమతించరు. తాము ఉండే లాకప్‌ను వారే శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది. అధికారులు చెప్పిన విధంగా ఇతర ఖైదీల మాదిరిగానే తోటపని, అన్ని రకాల క్లీనింగ్ పనులు చేయాల్సి ఉంటుంది. ఒకసారి నిర్ణీత ఫీజు రూ.500 చెల్లించి ఖైదీలు ధరించే డ్రెస్ వేసుకుని లోపలికి వెళ్తే 24 గంటలకు ముందుగా బయటకు రానివ్వరు. ఒక వేళ రావాలనుకుంటే ఒక వెయ్యి రూపాయలు జరిమానాగా చెల్లించాల్సి ఉంటుంది. మ్యూజియంను సందర్శించాలనుకున్నా, ఒక రోజు జైలు జీవితాన్ని అనుభవించాలనుకున్నా తెలంగాణా జైల్ ఎక్స్ పీరియన్స్.కామ్ వెబ్ సైట్‌లో బుకింగ్ చేసుకోవచ్చు.

# ఆడుకుంటున్న బాలుడిపై కుక్కల దాడి...

## తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు.

**వనస్థలిపురం. మే.12.ప్రభాతవార్త**



కుక్కల దాడిలో గాయపడిన బాలుడు అద్విక్.

ఇంటి ముందు బాలుడిపై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడి లో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి ఐసియు వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం బోటి మీది పల్లి గ్రామానికి చెందిన సుమన్ శివానిల కుమారుడు అద్విక్( 8) వ్యవసాయ కుటుంబం. శివాని ఆ గ్రామ సర్పంచ్. వేసవి సెలవుల్లో భాగంగా టీచర్స్ కాలనీ ఫేస్ టు లో ఉంటున్న పెద్దమ్మ కవిత వద్దకు వారం రోజుల క్రితం వచ్చాడు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటి బయట పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. టీచర్స్ కాలనీ రోడ్ నెంబర్ సెవెన్ లో సుమారు ఐదారు కుక్కలు అద్విక్ వెంటపడడంతో. పక్కన ఉన్న సెల్లార్ లోకి పరిగెత్తగా అతన్నిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. తీవ్ర గాయాల పాలైన అతన్ని బంధువులు కామినేని ఆస్పత్రికి తరలించారు.. వైద్యులు పరిశీలించి ఐసియూ వెంటిలేటర్ పై చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న బిజెపి ఎల్బీనగర్ అసెంబ్లీ ఇన్చార్జి. సామ రంగారెడ్డి, స్థానిక మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, జిహెచ్ఎంసి బిజెపి మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి, లింగోజిగూడ.మాజీ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి లు కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాలుడు అద్విక్‌ను మంగళవారం ఉదయం ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్య సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. అద్విక్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, బాలుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎల్బీనగర్ లో వీధి కుక్కల వరుస దాడులు బాధాకరమన్నారు. నియోజకవర్గంలో వీధి కుక్కల సమస్యపై సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు..



కుక్కల దాడిలో గాయపడిన బాలుడిని ఆసుపత్రిలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

# కిడ్నాప్ కేసులో ఏడుగురు అరెస్ట్

## - మూడు డమ్మీ తుపాకులు, మారణాయుధాలు స్వాధీనం



అరెస్ట్ అయిన నిందితులు



పట్టుబడిన డమ్మీ తుపాకులు, గొడ్డలి, సుత్తి

**జూబ్లీహిల్స్, మే 12, ప్రభాతవార్త:** పోలీసులమంటూ కిడ్నాప్‌కు పాల్పడి తుపాకులతో బెదిరించి డబ్బుల వసూలుకు పాల్పడిన సంఘటనతో ప్రధాన నిందితురాలితోపాటు మరో ఆరుగురిని బంజారా హిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ సుహాసన్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కొత్తగూడెంకు చెంది మాదాపూర్‌లోని సిద్ది వినాయక నగర్ లో నివసించే పాయం మౌనిక(25)కు నిఖిల్ అనే యువకుడితో పరిచయం ఏర్ప డింది. కారు డ్రైవర్‌గా పనిచేసే నిఖిల్ డిజిటల్ ఫైనాన్స్ వ్యాపారం అని చెప్పి మౌనికను నమ్మించాడు. ఆమెను కారులో పబ్బులకు తిప్పాడు. కొద్ది రోజులుకు ఇద్దరి మధ్య మనస్పర్ధలు రావడంతో మౌనిక గచ్చిబౌలి ఠాణాలో నిఖిల్‌పై ఫిర్యాదు చేసింది. ఈ కేసులో నిఖిల్ బెయిల్‌పై బయటకు రావడంతో ఎలాగైనా కక్ష సాధించాలని భావించిన మౌనిక ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇల్లందులో తనకు తెలిసిన రౌడీషీటర్ మహేష్, అతని సోదరుడు కనకం సుధీర్‌బాబు(36)కు విషయాన్ని తెలియజేసింది. నిఖిల్ వద్ద కోట్ల రూపాయలు ఉన్నాయని, అతని వద్ద నుంచి రూ. 4.50 కోట్లు వసూలు చేసి తనకు కోటి రూపాయలు ఇచ్చి మిగిలినవి తీసుకోవాలంటూ డీల్ సెట్ చేసుకొంది. ఈ క్రమంలోనే మహేష్ అల్వాల్‌లో నివసించే బీఆర్ఎస్ నాయకుడు కల్వకుంట్ల కన్నారావు అనుచరుడైన దామెర జాన్(39)ను సంప్రదించాడు. విషయం తెలుసుకున్న అతను అంబర్‌పేటకు చెందిన రౌడీషీటర్ అన్వర్‌ఖాన్(60)ను తెలియజేయడంతో అతని ద్వారా దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన పొల్కంపల్లి నాగరాజు(48), ఏపీలోని మార్కాపురంకు చెందిన చిన్న చర్లపల్లిలో నివసించే సుంకరి ప్రసాద్‌రెడ్డి(56), మేడ్చల్ మల్కాజిగిరికి చెందిన మార్నేని రాజు(48), బంజారాహిల్స్ ఎన్బీటీనగర్‌కు చెందిన చందుతో జతకట్టారు. వీరంతా కలిసి మాదాపూర్‌లోని ఒక అతిధిగృహంలో సమావేశమయ్యారు. ఈ క్రమంలోనే నిఖిల్ స్నేహితుడైన బంజారాహిల్స్‌లోని ఎన్బీటీనగర్‌లో నివసించే ముల్కపల్లి సాయి శ్రీశాంత్ (25)ను ఒక వాహనంలో కిడ్నాప్ చేశారు. అతని ద్వారా అనంతపురంలో ఉన్న సాయి చిరునామా తెలుసుకొని అక్కడికి వెళ్లి అతన్ని, అతని స్నేహితుడైన మహేష్‌ను కిడ్నాప్ చేసి నగర శివారులోని ఫాంహౌజ్‌లో బంధించి తుపాకులతో బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే రూ. 13.50 లక్షలు నిఖిల్ నుంచి వసూలు చేసి మిగిలిన సొమ్ముకు అప్పు కాగితం రాయించుకున్నారు. జరిగిన సంఘటనపై సాయి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ప్రధాన నిందితురాలు పాయం మౌనికతోపాటు కనకం సుధీర్‌బాబు, దామెర జాన్, సుంకరి ప్రసాద్‌రెడ్డి, మార్నేని రాజు, అన్వర్‌ఖాన్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మూడు డమ్మీ తుపాకులు, ఒక గొడ్డలి, ఒక సుత్తిని, కొన్ని చక్రాలను స్వాధీనం చేసుకున్నారు. రౌడీషీటర్ మహేష్ చందు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకొనేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

# ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి : కొండా సురేఖ



తాడ్‌బన్ హన్‌మాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న మంత్రి కొండ సురేఖ

**కంటోన్మెంట్,మే 12 ప్రభాతవార్త:** స్వామి వారి అశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ తెలిపారు. హన్‌మాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ తాడ్ బందు హన్‌మాన్ దేవాలయంలో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తాడ్ బంధు హన్‌మాన్ దేవాలయ అభివృద్ధికి సదాకేశవరెడ్డి కోటీ రూపాయల వ్యయంతో ఆలయ అభివృద్ధికి పనులు చేపట్టడం అభినదనీయమన్నారు. అటువంటి దాతలు ఆలయాల అభివృద్ధికి సహకరిస్తే ఆలయాల మరింత అభివృద్ధి చెందడంతో పాటు వారికి భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఏ.నరేందర్, గణేష్ దేవాలయం ఈఓ రామక్రిష్ణ,కంటోన్మెంట్‌లోని పలు దేవాలయాల చైర్మన్లు ప్రభాకర్ యాదవ్,అల్లాడి గౌరి శంకర్,నందికంటి రవి, రేపాల వెంకటేశ్వర్లు కాంగ్రెస్ నేతలు చిర్రబోయిన వైష్ణవి యాదవ్, సంతోష్ యాదవ్,ముప్పిడి మధుకర్,చింతల వేణుగోపాల్ రెడ్డి,నాగినేని సరిత, శేఖర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి తుమ్మల



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, బండి రమేష్ తదితరులు.

**జూబ్లీహిల్స్, మే 12, ప్రభాతవార్త:** అమీర్‌పేటలోని మైత్రివనం కూడలిలో నిర్మించనున్న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు సంబంధించిన ప్రాంతాన్ని మంగళవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కమ్మ కార్పొరేషన్ సంఘం ఛైర్మన్ బండి రమేష్ పరిశీలించారు. ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ అభ్యర్థన మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విచ్చేసి విగ్రహ ప్రతిష్టాపన పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో నగర అభివృద్ధితో పాటు మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు చేరవేసే కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ మాట్లాడుతూ, తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ గారి విగ్రహాన్ని అమీర్‌పేట్ – మైత్రివనం ప్రాంతంలో ప్రతిష్టించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిహెచ్ఎంసి అధికారులు, స్థానిక కార్పొరేటర్ వనం సంగీత, చిన్న శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు. పెళ్లిరోజు కావడంతో మంత్రి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నవీన్‌యాదవ కేక్ కట్ చేసి తన ఆనందాన్ని పంచుకున్నారు.

# నగరంలో మరో కొత్త ఫ్లైఓవర్..

## -అల్వీన్ కాలనీ టూ మియాపూర్
## -రూ.530కోట్లు మంజూరు చేసిన సర్కార్

**హైదరాబాద్, మే 12,ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలోని ఆల్విన్ కాలనీ నుంచి మియాపూర్ వరకు ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.530 కోట్లతో కొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు జారీ చేసింది. 1.8 కిలోమీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పుతో ఆరు లేన్లుగా ఈ వంతెన నిర్మాణం జరగనుంది. అంజయ్య నగర్ మీదుగా సాగే ఈ ఫ్లైఓవర్ ద్వారా కూకట్‌పల్లి, జేఎన్టీయూ, నిజాంపేట్ వంటి రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ గణనీయంగా తగ్గనుంది. ఈ భారీ ప్రాజెక్టు కోసం రూ.530 కోట్లను కేటాయిస్తూ ప్రభుత్వం తాజాగా పరిపాలనా పరమైన అనుమతులను మంజూరు చేసింది. ఈ నిర్ణయంతో కూకట్‌పల్లి, మియాపూర్ పరిసర ప్రాంతాల్లోని లక్షలాది మంది వాహనదారులకు పెద్ద ఉపశమనం లభించనుంది. ఈ కొత్త ఫ్లైఓవర్‌ను అంజయ్య నగర్ మీదుగా నిర్మించనున్నారు. దీని మొత్తం పొడవు 1.8 కిలోమీటర్లు కాగా.. 24 మీటర్ల వెడల్పుతో 6 లైన్ల మార్గంగా దీనిని తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వం కేటాయించిన రూ.530 కోట్లలో.. కేవలం నిర్మాణ పనుల కోసమే రూ.330 కోట్లు ఖర్చు చేయనున్నారు. మిగిలిన రూ.200 కోట్లను నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, నష్టపరిహారం కోసం కేటాయించారు. పరిపాలన అనుమతులు రావడంతో జీహెచ్ఎంసీ అధికారులు త్వరలోనే భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి టెండర్ల ప్రక్రియను ప్రారంభించనున్నారు. కాగా హైదరాబాద్ మహానగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే అనేక ప్రాంతాల్లో కొత్త ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు నిర్మించింది. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ఉత్తర తెలంగాణకు వెళ్లే వాహనదారుల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు సికింద్రాబాద్ నుంచి రెండు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తోంది. ఇక తెలుగు రాష్ట్రాల మధ్య కీలకమైన హైదరాబాద్ విజయవాడ హైవేపై ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు మరో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సిద్ధమవుతోంది. దాంతో పాటుగా కొత్త స్కైవాక్‌లు కూడా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

# చిక్కడపల్లిలో పేదల బతుకుబండ్లపై జెసిబి పంజా

## -ముందస్తు నోటీసు లేకుండానే ధ్వంసం.. పూల వ్యాపారుల ఆవేదన



వేంకటేశ్వర స్వామి దేవాలయ కమాన్ సమీపంలో పూల బండ్లను తొలగించిన దృశ్యం



**చిక్కడపల్లి మే 12 ( ప్రభాతవార్త ) :** చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ కమాన్ సమీపంలో పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలపై అధికారుల చర్య తీవ్ర వివాదాస్పదంగా మారింది. మంగళవారం తెల్లవారుజామున సుమారు 6 గంటల సమయంలో అధికారులు జెసిబిలతో వచ్చి ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రోడ్డు పక్కన ఉన్న బండ్లను తొలగించడం స్థానికుల్లో ఆగ్రహానికి దారితీసింది.ప్రత్యేకంగా పార్థి (పిట్టల) కులానికి చెందిన పేద కుటుంబాలు గత కొన్ని దశాబ్దాల నుండి పూలు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్న బండ్లను విచక్షణారహితంగా ధ్వంసం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. జెసిబిలతో బండ్లను తొక్కిపారేయడంతో వ్యాపార సామగ్రి, పూల నిల్వలు, బండ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని వారు కన్నీరుమున్నీరయ్యారు. స్థానికుల కథనం ప్రకారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నుంచి నారాయణగూడ వరకు అనేక ఆక్రమణలు కొనసాగుతున్నప్పటికీ, కేవలం రెండు మూడు పేదల బండ్లపైనే అధికారులు చర్యలు చేపట్టడం అనుమానాలకు తావిస్తోంది. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వారిని లక్ష్యంగా చేసుకోవడం అన్యాయమని స్థానికులు మండిపడుతున్నారు.మేము ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా జీవనం సాగిస్తున్నాం. కనీసం ముందుగా చెప్పి ఉంటే మా సామాను తీసుకునే అవకాశం ఉండేది. ఒక్కసారిగా వచ్చి మా బతుకుబండ్లనే ధ్వంసం చేశారు” అంటూ బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ ఇది టౌన్ ప్లానింగ్ అధికారుల చర్య అయితే ప్రధాన రహదారులపై ఉన్న పెద్ద ఎత్తున ఆక్రమణలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల వైఖరిపై స్థానిక ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ పేదల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఫుట్‌పాత్ ఆక్రమణలపై కఠిన చర్యలు

ప్రభుత్వ ఆదేశాల మేరకే తొలగింపులు: టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్

ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్నట్లు టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారాలు, నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన బండ్లు, షెడ్లు, ఇతర నిర్మాణాలను తొలగించే చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గించడంతో పాటు పాదచారులకు సౌకర్యవంతమైన మార్గం కల్పించేందుకే ఈ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.ప్రజలు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఫుట్‌పాత్‌లు, రహదారులను ఆక్రమించకుండా వ్యాపారాలు లేదా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఆక్రమణలు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సేవాదళ్ కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలి : మిద్దెల జితేందర్


రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డికి నివేదికను సమర్పిస్తున్న కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్

**సైదాబాద్, మే 12 ప్రభాతవార్త:** రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సామర్థ్య శిక్షణా శిబిరంకు సంబంధించిన నివేదికను అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న సేవాదళ్ కార్యకర్తలకు కార్పొరేషన్లు, కమిటీలు, ఇతర నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యత కల్పించి సముచిత గుర్తింపు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో సేవాదళ్ కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని జితేందర్ పేర్కొన్నారు. తాము చేసిన విజ్ఞప్తికి రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, సేవాదళ్ కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి తగిన న్యాయం చేస్తానని చెప్పడం జరిగిందని మిద్దెల జితేందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీసువర్చల సహిత హనుమాన్ జయంతోత్సవం


హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, చంద్రశేఖర్‌ఆజాద్

**ఎల్.బి.నగర్, మే 12 ప్రభాతవార్త:** నాగోలు గ్రామంలోని శ్రీసీతారామచంద్ర, శ్రీఆంజనేయస్వామివారి దేవాలయంలో శ్రీసువర్చల సహిత హనుమాన్ జయంతోత్సవం, 14వ వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవ వేడుకలు మంగళవారం భక్తుల కోలాహలం మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు దేవాలయం డైరెక్టర్ కొలను చంద్రశేఖర్‌ఆజాద్ తెలిపారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మాజీ కార్పొరేటర్ ముద్దగొని లక్ష్మీప్రసన్న, అనంతుల రాజారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని చంద్రశేఖర్‌ఆజాద్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా దేవాలయం పాలకమండలి పర్యవేక్షణలో నాగభూషణం భక్త సమాజం వారితో భజనలు, ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోలన్ నరసింహగౌడ్, నాగోల్ సుధాకర్‌చారి, కట్టా ఈశ్వరయ్యగౌడ్, బద్దం రవీందర్‌గౌడ్, బద్దం నరేందర్‌గౌడ్, బద్దం శ్రీధర్‌గౌడ్, రావుల రంజిత్‌గౌడ్, బి.మహేష్‌యాదవ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు: కిరణ్ కుమార్


మారుతి మందిర్ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న చిట్టెం కిరణ్ కుమార్, బొట్టు శ్రీనివాస్, గౌని చంద్రయ్య, గడ్డం నందు, నరేందర్ తదితరులు

**మలక్ పేట, మే 12, ప్రభాతవార్త:** దిల్ షుక్ నగర్ మారుతి మందిర్ లో హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. దేవాలయం ధర్మకర్తలు చిట్టెం కిరణ్ కుమార్, బొట్టు శ్రీనివాస్, గౌనీ చంద్రయ్య, నరేందర్ తదితరులు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయంలో ప్రతి నిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మారుతి మందిర్ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం నందు, శ్యాం రావు, ఆలయ ఇఓ రవీందర్ రెడ్డి, సూపర్ వైజర్ గోవర్ధన్, ఆలయ అర్చకులు ప్రహ్లాద్ జోషి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి బ్యానర్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి


మలక్ పేట్ ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహ కు ఫిర్యాదు చేస్తున్న బిజెపి నాయకులు బొక్క మధుసూదన్ రెడ్డి, రమేష్ రెడ్డి, కొప్పుల దినేష్ తదితరులు

**మలక్ పేట,మే 12, ప్రభాతవార్త:** బిజెపి బ్యానర్ లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి బొక్క మధుసూదన్ రెడ్డి, మాజీ కోశాధికారి రమేష్ రెడ్డి, ముసారాంబాగ్ డివిజన్ అధ్యక్షులు కొప్పుల దినేష్ లు పేర్కొన్నారు. ముసారాంబాగ్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన బిజెపి బ్యానర్లను తొలగించిన గుర్తు తెలియని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వారు మలక్ పేట ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి బ్యానర్లను తొలగించడం సరైనది కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాజుల శివ తదితరులు పాల్గొన్నారు.


## రైల్వే చీఫ్ ఇంజనీర్‌ను కలిసిన జలమండలి అధికారులు



**మల్కాజిగిరి మే 12 ప్రభాతవార్త:** మల్కాజ్గిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు రైల్వే చీఫ్ ఇంజనీర్ సదర్మ రాయల్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ గణేషన్‌ను హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా గౌతమ్ నగర్ లెవెల్ క్రాసింగ్ వద్ద 42 కోట్లతో నిర్మించనున్న ఆర్యుబి నిర్మాణం కోసం రాను స్టామ్ వాటర్ పైప్ లైన్ ఏర్పాటు, డ్రైనేజీ నిర్మాణం ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీజీఎం శ్రీనివాస్ రెడ్డి, జీ.ఎం. సునీల్ మేనేజర్ నవీన్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ తదితరులున్నారు.


శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, ధారా అశోక్ రాజు, కాటూరి శ్రీనివాసచార్యులు తదితరులు


హనుమాన్ పూజలో పాల్గొన్న చిలుక మధురఉపేందర్‌రెడ్డి


హనుమాన్ జయంతి సందర్భంగా సాహెబ్ నగర్ లోని శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల శ్రీనివాస్ గౌడ్ తదితరులు.


హనుమాన్ జయంతి సందర్భంగా ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ, కాశిరెడ్డి, ముత్యం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీశైలం, మాధవి, పద్మావతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు కిషోర్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**శాలివాహన నగర్ లో**

**మలక్ పేట, మే 12, ప్రభాతవార్త:** ముసారాంబాగ్ డివిజన్ శాలివాహన నగర్ లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. దేవాలయం కమిటీ అధ్యక్షులు దొంతుల మాణిక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి పలు పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ కార్యదర్శి దొంతుల రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, కోశాధికారి కొండలరావు, సభ్యులు బండారు జంగయ్య గౌడ్, వాల్మీకి శంకర్, దారా అశోక్ రాజు, ముత్తినేని మల్లయ్య, దొంతుల సుధాకర్ రెడ్డి, రఘువరన్ ఆలయ అర్చకులు కాటూరి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

**ఆర్కేపురంలో**

**ఎల్.బి.నగర్, మే 12 ప్రభాతవార్త:** శ్రీరామకృష్ణాపురం, ఎన్టీఆర్‌నగర్‌లోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు భక్తుశ్రద్ధలతో నిర్వహించారు. హనుమాన్ జయంతి ఉత్సవాలలో కాంగ్రెస్ నాయకుడు చిలుక మధురఉపేందర్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ రమేష్‌నేత, మాజీ చైర్మన్ రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

**ఉప్పల్‌లో**

**ఉప్పల్, మే 12 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ ఎన్‌జిఆర్ఐ వద్ద ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వెంకన్న, పూజారి రవీందర్‌శర్మ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు బజారు పాండు గౌడ్, దేవాలయ కమిటి సభ్యులు బికుమళ్ల అంజయ్య గుప్తా, ఈగ అంజనేయులు, తుమ్మల దేవి రెడ్డి, బూసం రఘునాథ్ రెడ్డి, వర్కల మధన్ గౌడ్, కడవ నర్సింగ్, కిషన్ నాయక్, సంతోష్ కుమార్, రవి శర్మ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కంది శ్రవణ్ రెడ్డి, రాజన్న, మాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామ కాలనీలో శ్రీ హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కాలనీ గౌరవ అధ్యక్షులు పల్లె రాజ్ కుమార్ గౌడ్, బోరంపేట రమేష్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రమేష్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ నర్సిరెడ్డి, సాయిలు ముదిరాజ్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి, జంగయ్య, మోర అంజిరెడ్డి, అప్పారావు, ముదిగొండ జగన్, బెజ్జం శ్రీనివాస్, రామానుజం, బజారు పాండు గౌడ్, పూజల ప్రభాకర్, అన్న బాలకృష్ణ, బూత్కూరు సాయి గౌడ్, గజ్జల సత్యరాజ్ గౌడ్, మేడిపల్లి నవీన్‌చారి, కోల రవికుమార్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ వ్యాపారి అమిత్ జైన్ విద్యావేత్త సతీష్ కుమార్, మాజీ కౌన్సిలర్ జి. శ్రీనివాస శర్మ, ప్రశాంత్ రెడ్డి ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీరప్పగడ్డ డివిజన్‌లోని మండే మార్కెట్ ప్రాంతంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద భక్తులకు మహా ప్రసాదంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిట్ల శ్రీనివాస్, ప్రదీప్, సత్యరాజ్ గౌడ్, బూత్కూరి నవీన్, సాయిబాబా, పవన్, వంశీ, కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రామంతాపూర్‌లో..**

శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీనగర్ కాలనీలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దైవ భక్తి మనసుకు ప్రశాంతతను, జీవితానికి సానుకూల దృక్పథాన్ని అందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనతో ముందుకు సాగితే సమాజంలో మంచి వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం సాయి కిరణ్, డివిజన్ ఓబీసీ అధ్యక్షుడు వేముల తిరుపతయ్య, రాంబ్రహ్మం, పి. శైలేందర్, ఎంఎస్ యాదవ్, సందీప్ పటేల్, యాదగిరి రెడ్డి, రాపోలు సాయినాదజ్ తదితరులు పాల్గొన్నారు. బిజెపి డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్ గుప్తా పూజలు నిర్వహించారు. రామంతాపూర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ట్రస్టీ కోట్ల నరసింహారెడ్డి, ఆలయ కార్యదర్శి విజయభారతి, శంకర్‌ల ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు.


హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు


శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

## భక్తజన సంద్రంగా మారిన కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం


ధ్యానాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

**సైదాబాద్, మే 12 ప్రభాతవార్త:** హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చారిత్రక నేపథ్యం కలిగిన కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. హనుమంతుడికి ప్రీతిపాత్రమైన మంగళవారం హనుమాన్ జన్మదినోత్సవం రావడంతో దేవాలయం భక్తజన సంద్రంగా మారింది. ఉదయం నుండే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి క్యూ లైన్లలో నిలబడి ధ్యానాంజనేయ స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారికి సింధూర అభిషేకము, పాలు, పెరుగు, పలు రకాల పండ్లతో అభిషేకం, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి దేవాలయ ఆవరణలో చలువ పందిళ్లు వేసి ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. దేవాలయాన్ని సుందరంగా అలంకరించారు. భక్తులకు త్రాగునీరు, మజ్జిగను పంపిణీ చేశారు. ఏర్పాట్లను దేవాలయ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, కార్యనిర్వాహణాధికారి లావణ్య, ధర్మకర్తలు పర్యవేక్షించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దర్శనం టికెట్ కౌంటర్లు, ప్రసాదం పంపిణీ కౌంటర్లను అదనంగా ఏర్పాటు చేశారు. ధర్మకర్తలు ఎనుముల రవీందర్‌రెడ్డి, పూల నాగరాజు, జనుంపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, తోకటి కిరణ్ కుమార్, దిండు ప్రవీణ్‌గౌడ్, సింగంశెట్టి శ్రీనివాస్, కుకునూరి గోపాల్‌రెడ్డి, కవిత, రాజేశ్వరి, నరేష్, సంతోష్ కుమార్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## 16 నుండి నిరవధికంగా సెంట్రింగ్ పనుల బంద్ : నవారు శ్రీనివాస్‌రెడ్డి



సమస్యలు, డిమాండ్లు, సమ్మె వివరాలు వెల్లడిస్తున్న సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నవారు శ్రీనివాస్‌రెడ్డి

**సరూర్‌నగర్, మే 12 ప్రభాతవార్త:** వృత్తికి సంబంధించిన న్యాయమైన డిమాండ్లు, సమస్యల సాధన కోసం ఈ నెల 16వ తేదీ నుండి సెంట్రింగ్ బంద్‌ను చేస్తున్నామని మీర్‌పేట్ అండ్ బడంగ్‌పేట్ జోన్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నవారు శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం ఉదయం బడంగ్‌పేట్ పాత కమాన్ సమీపంలోని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో పలువురు కాంట్రాక్టర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరవధికంగా సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. భవన నిర్మాణ రంగంలో చాలా కీలకమైన సెంట్రింగ్‌కు సంబంధించి రేట్ల విషయంలో కాంట్రాక్టర్లకు చాలా అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2016లో స్క్వైర్ ఫీట్‌కు సెంట్రింగ్ రేటు రూ.40 ఉంటే నేడు రూ.25 నుండి రూ.30 వరకు దిగజారిందనీ దీని వల్ల లక్షల రూపాయల పెట్టుబడి పెట్టిన కాంట్రాక్టర్లందరూ రోడ్డున పడుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. సెంట్రింగ్ పనుల్లో గిట్టుబాటు కాకపోగా నష్టాల పాలైన చాలా మంది కాంట్రాక్టర్లు స్క్రాప్ కింద సెంట్రింగ్ సామాన్లు విక్రయించుకొని నేడు ఆటో డ్రైవర్లుగా, దినసరి కూలీలుగా మారుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సెంట్రింగ్ ముడి సరుకులు అయిన మోలలు, చెక్కలు, వాల్ ప్లేట్లు తదితర మెటీరియల్ రేట్లు భారీగా పెరగడంతో పాటు రవాణా వ్యయం కూడా అధికమైనా సెంట్రింగ్ రేట్లు మాత్రం పెరగక ఇంకా దిగజారడం వల్ల కాంట్రాక్టర్లు వీధిన పడుతున్నారని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో నిర్వీర్యమైపోతున్న ఈ వ్యవస్థలోని కాంట్రాక్టర్లను కాపాడేందుకు గ్రేటర్ హైదరాబాద్ అసోసియేషన్ నడుం బిగించిందని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో 70 జోన్ల ఏకతాటిపైకి వచ్చి ఈ నెల 16 నుండి నిరవధిక సమ్మెకు పూనుకున్నాయని ఆయన వివరించారు. ఈ మేరకు మీర్‌పేట్, బడంగ్‌పేట్ జోన్‌ల పరిధిలో సెంట్రింగ్ సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్క్వైర్ ఫీట్‌కు రూ.51 చేయడంతో పాటు న్యాయమైన తమ డిమాండ్లు, సమస్యలను పరిష్కరిస్తే గానీ సమ్మె ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీపతి వెంకట్‌రెడ్డి, కోశాధికారి రవీందర్, సలహా దారులు ఆసిరెడ్డి, జి.యాదయ్య, ఎర్ర బాబూరావు, దేవేందర్, నర్సి రెడ్డిలతో పాటు పెద్ద సంఖ్యలో కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షల వేళ మల్కాజిగిరిలో 144 తరహా ఆంక్షలు

### -కమిషనర్ సుమతి

**నేరెడ్ మెట్,మల్కాజిగిరి కమిషనరేట్ మే 12 ,ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ నేపథ్యంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పోలీసులు కట్టుదిట్టమైన ఆంక్షలు విధించారు. మే 13 నుంచి 21 వరకు జరిగే పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతలు భంగం కలగకుండా, మాల్‌ప్రాక్టీసులను అరికట్టేందుకు భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద ఉత్తర్వులు జారీ చేసినట్లు కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ తెలిపారు. ఉత్తర్వుల ప్రకారం పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడాన్ని నిషేధించారు. ఈ ఆంక్షలు మే 13 ఉదయం 6 గంటల నుంచి మే 21 సాయంత్రం 6 గంటల వరకు అమల్లో ఉంటాయి. అయితే విధుల్లో ఉన్న పోలీసులు, సైనిక సిబ్బంది, హోంగార్డులు, విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్లు, అంత్యక్రియల ఊరేగింపులకు మినహాయింపు కల్పించారు. అలాగే పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ (ఫోటోకాపీ) కేంద్రాలు, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్షా రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూసివేయాలని ఆదేశించారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై బీఎన్ఎస్ఎస్ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

### -హాజరైన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాంచందర్‌రావు


మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు జ్ఞాపికను అందజేస్తున్న బండ చంద్రారెడ్డి

**తార్నాక, మే 12: ప్రభాతవార్త :** హనుమాన్ జయంతి సందర్భంగా తార్నాకలోని శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ తదితరులు విచ్చేసి శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బండ చంద్రారెడ్డి వారికి ఘన సన్మానం చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు హాజరై స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్ రెడ్డి, ఉపేందర్ యాదవ్, పోచయ్య యాదవ్, వెంకటేష్ గౌడ్, సుక్క గణేష్ ముదిరాజ్, కొన్నె సంపత్, వీరన్న, రాము వర్మ, రాజకుమార్, వల్లారపు శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

## రేపు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్‌గా బసవరాజు శ్రీనివాస్ ప్రమాణస్వీకారం



**ఎల్.బి.నగర్, మే 12 ప్రభాతవార్త:** తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్‌గా ప్రముఖ సామాజిక సేవకుడు, భారత్ సేవా సహకార్ ఫోరం (బీఎస్ఎస్ఎఫ్) చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్‌చైర్మన్‌గా పొన్నాడ సుబ్రహ్మణ్యప్రసాద్ నియామకం కాగా ఈనెల 14వ తేదీ గురువారం వారు ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు బ్రాహ్మణ సంఘాలు, బ్రాహ్మణ ఆర్గనైజేషన్స్ ఫర్ సోషల్ సర్వీసెస్(బాస్) ప్రతినిధులు వక్కలంక శ్రీనివాసరావు, నందిరాజు లక్ష్మీనారాయణ, ఎంవీ.శా', ఆర్.మూర్తిలు తెలిపారు. సామాజిక సేవకుడు బసవరాజు శ్రీనివాస్ చైర్మన్‌గా నియామకం కావడం బ్రాహ్మణ సమాజానికి గర్వకారణమన్నారు. నాగోల్ బండ్లగూడలోని వసంత్ విహార్ ఫంక్షన్ హాలులో 14వ తేదీ గురువారం ఉదయం ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ హాజరవుతారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణ సమాజం, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాస్ ప్రతినిధులు ఇవటూరి కైలాష్, మంగు రాఘవరావు, ప్రమోద్కటార్, ఏలూరి శ్రీనివాస్ రావు తదితరులు ఉన్నారు.

## జనగణన పనులపై జెడ్‌సి రాధిక గుప్తా సమీక్ష


జనగణన పనులపై సమీక్ష నిర్వహిస్తున్న జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తదితరులు

**ఉప్పల్, మే 12 ప్రభాతవార్త :** ఉప్పల్ జోనల్ పరిధిలోని ఉప్పల్, నాచారం సర్కిల్‌లో జనగణన పనులపై మంగళవారం జోనల్ కమిషనర్ రాధికా గుప్తా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. ఈ మేరకు ఉప్పల్, నాచారం సర్కిల్‌లో కొనసాగుతున్న జనగణన పనులను జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉప్పల్ జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో మొత్తం 1705 ఎన్యూమరేటర్ బ్లాక్‌లు, 286 మంది సూపర్వైజర్లు, 1840 మంది ఎన్యూమరేటర్లు నియమించినట్లు తెలిపారు. జనగణన పనులను ఖచ్చితత్వంతో, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. విధులలో నియమించబడిన అధికారులు, సిబ్బంది అందరూ పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, సూచనలు పాటించాలని కోరారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలు మరియు సంక్షేమ పథకాల అమలులో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని ఆమె తెలిపారు. ప్రజలు కూడా జనగణన సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు.


## ద్వారకామాయి సాయిబాబా పీఠంలో విశేష పూజలు


బాబాకు, హనుమాన్‌కు విశేష పూజలు జరిపిన ద్వారకామాయి సాయిబాబా పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ

**సరూర్‌నగర్, మే 12 ప్రభాతవార్త:** ఆధ్యాత్మిక బోధనల ద్వారా సమాజంలో పరివర్తన తేవడానికి కృషి చేస్తున్న మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్‌లోని శ్రీ ద్వారకామాయి సాయి బాబా పీఠంలో బాబా విగ్రహ ప్రతిష్టాపన జరిగి 13 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా పీఠాధిపతి అయిన దత్త సిద్ధాంత ఆదికర్త, శ్రీపాద శ్రీవల్లభుల వంశంలో 34వ తరానికి చెందిన పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ మంగళ శాసనములతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. బాబా వారి 13వ విగ్రహ వార్షికోత్సవానికి తోడు హనుమాన్ జయంతి రావడంతో పీఠాధిపతి ఆధ్వర్యంలో సాయిబాబాకు, హనుమంతునికి ప్రత్యేక అభిషేకాలు చేసి గ్యారెలు, అప్పాలతో మహా నివేదన జరిపారు. ఈ మహత్తర పూజా కార్యక్రమాల్లో బాబా భక్తులు మల్లాది జయలక్ష్మి, సుందరలక్ష్మి, లాస్య ప్రియ, ప్రభాకర శాస్త్రి, విమలా శాస్త్రి, పీఠం మాతాజీ మల్లాది విజయశ్రీ, మల్లాది సాయికుమార్, శ్రావ్య పాల్గొన్నారు.


సమస్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

## అక్రమ వెంచర్లపై టౌన్ ప్లానింగ్ కొరడా


అక్రమ వెంచర్లలో కూల్చివేతలు నిర్వహిస్తున్న బడంగ్‌పేట్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది

**సరూర్‌నగర్, మే 12 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ సర్కిల్‌లోని బాలాపూర్ పరిధిలో అక్రమ వెంచర్లపై టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝులిపించారు. స్థానిక 9, 10, 11 సర్వే నెంబర్లలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్‌లోని విద్యుత్ స్థంభాలు, భూగర్భ నీటి ట్యాంకులు తదితర వాటిని తొలగించి అంతర్గత రోడ్లను ధ్వంసం చేశారు. సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో ఎసిపి (అసిస్టెంట్ సిటీ ప్లానర్) కిరణ్‌కుమార్ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి కూల్చివేతలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసే వెంచర్లను ఉపేక్షించేది లేదనీ కఠిన చర్యలు తీసుకొని తొలగిస్తామని స్పష్టం చేశారు. ప్లాట్లు కొనుగోలు చేసే ముందు ప్రజలు వెంచర్ అనుమతులు, లౌఔట్ ఆమోదాలు, రిజిస్ట్రేషన్ పత్రాలను సరిగ్గా పరిశీలించుకోవాలని సూచించారు. అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో రోడ్లు, డ్రైనేజీలు, తాగు నీరు, విద్యుత్ తదితర కనీస సదుపాయాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అనుమతులు లేని వెంచర్లలో ఎవరూ కూడా ప్లాట్లు కొనుగోలు చేయవద్దనీ అనవసర పెట్టుబడులు పెట్టవద్దని ఆయన సూచించారు. సర్కిల్ పరిధిలో ఎక్కడైనా అక్రమ వెంచర్ జరిగితే స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి నిర్దాక్షిణ్యంగా తొలగిస్తామని ఎసిపి కిరణ్‌కుమార్ హెచ్చరించారు. సర్కిల్ ఏరియాలో అక్రమ వెంచర్లపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ దినేష్ పాల్గొన్నారు.

## ఎన్డీడీబీ, ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందం

### పూర్వ వైభవం దిశగా నార్ముల్ మదర్ డెయిరీ


మంత్రికి చెక్కును అందిస్తున్న ఎన్డీడీబీ ప్రతినిధులు

**హయత్ నగర్, మే 12 ప్రభాతవార్త :** నార్ముల్ మదర్ డెయిరీని ఎన్డీడీబీకి అప్పగించడంలో భాగంగా మంగళవారం ఒప్పంద ప్రక్రియ పుర్తయ్యింది. ప్రభుత్వం తరపున పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, సెక్రటరీ ఇలాంబర్తి, ఆలేరు ఎమ్మెల్యే, బీర్ల అయిలయ్య, నార్ముల్ చైర్మన్ మధుసూదన్ రెడ్డిలు హాజరై ఎన్డీడీబీ ప్రతినిధులతో ప్రక్రియను పూర్తి చేశారు. ఆ వెంటనే పాడి రైతుల పాల బిల్లుల చెల్లింపు కోసం రు. 10 కోట్ల రూపాయల ను నార్ముల్ అకౌంట్ కు బదిలీ చేస్తూ సంబంధిత చెక్కును ఎన్డీడీబీ ప్రతినిధులు చైర్మన్ కు అందించారు. కార్యక్రమంలో నార్ముల్ మదర్ డెయిరీ ఎండీ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఎద్దుల తరలింపుపై దాడి..9 మంది అరెస్ట్

**నేరెడ్ మెట్, మల్కాజిగిరి కమిషనరేట్ మే 12 ,ప్రభాతవార్త :** ఎద్దులను అక్రమంగా వధశాలకు తరలిస్తున్నారనే అనుమానంతో దాడికి పాల్పడి పశువుల రవాణాదారులతో పాటు పోలీసులపై కూడా రాళ్లు రువ్విన ఘటనలో సారూర్‌నగర్ పోలీసులు 9 మందిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి మరికొందరిని గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. పోలీసుల కథనం ప్రకారం.. మే 11, 12 తేదీల మధ్య అర్ధరాత్రి 1.45 గంటల సమయంలో కోతపేట ఎక్స్ రోడ్ వద్ద డీసీఎం వాహనంలో 8 ఎద్దులను వాటి యజమానులతో కలిసి పురానీ హవేలీలో జరిగే సినిమా షూటింగ్‌కు తీసుకెళ్తుండగా కొందరు అడ్డుకున్నారు. వధ కోసం తరలిస్తున్నారనే అనుమానంతో వాహనాన్ని నిలిపివేసి డ్రైవర్, యజమానులను దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగా వారిపైనా దుండగులు దాడి చేశారు. అనంతరం ఎద్దులను భద్రతార్థం ఫతుల్లగూడ గోశాలకు తరలిస్తుండగా చైతన్యపురి యూటర్న్ సమీపంలో బైక్‌లపై వెంబడించిన కొందరు డీసీఎంను అడ్డగించి రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ఇన్‌స్పెక్టర్‌తో పాటు పలువురు పోలీసులకు గాయాలు కాగా వాహనం ధ్వంసమైంది. వెంటనే స్పందించిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి 9 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం వారిని రిమాండ్‌కు తరలించింది. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో మే 7 నుంచి 24 గంటల పాటు 7 పోలీస్ చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. పశువుల రవాణాపై ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలని, చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోవద్దని హెచ్చరించారు. ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.